క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు


హార్బర్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. ఇటీవల జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా రైతు బజార్ సమీపంలో ఉన్న హార్బర్ స్టేషన్ దరి రైలు మార్గం వద్ద స్పీడ్‌బ్రేకర్లు, సిగ్నల్స్ లైట్లు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని 'సాక్షి'లో 'టెర్రర్' శీర్షికన ప్రత్యేక కథనం వెలువడిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. రైలుమార్గానికి రెండు వైపులా గతంలో వేసిన ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు తొలగించి సిమెంట్‌తో బ్రేకర్లను ఏర్పాటు చేశారు. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సిగ్నల్ లైట్లు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడికి సత్కారం


అప్పారావును సత్కరిస్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖలో పెద్ద ఎత్తున కంటి వైద్య శిబిరాలు నిర్వహించడమే కాక, ఈ ఏడాది 98 మందికి కంటి ఆపరేషన్లు చేయించిన స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావును శంకర్ ఫౌండేషన్ సోమవారం ఘనంగా సత్కరించింది. ఆత్మకూరి శంకర్రావు జయంతిని పురస్కరించుకుని అప్పారావుకు ప్రత్యేక పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సూరాడ అప్పారావు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, ఈ ఏడాది 98 మంది వరకు కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. అంత మంది కళ్లల్లో వెలుగు నింపడం ఆనందంగా ఉందన్నారు.

నేటితో ముగియనున్న శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారం 29వ రోజుకి చేరాయి. గత నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన పూజలు మంగళవారంతో ముగియనున్నాయి. సోమవారం ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.


దొండపర్తిలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి వేడుకల్లో మహానేతకు నివాళులు అర్పిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు


పేదలకు చీరలు అందజేస్తున్న శ్రీవత్సవ్


34వ వార్డులో పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తోట పద్మావతి తదితరులు


వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి

జోహార్.. వైఎస్సార్

పేదల పెన్నిధి, సంక్షేమ సారథి, పాలనాదక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నియోజకవర్గ పరిధిలో చిన్నాపెద్దా అంతా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు, పళ్లు పంపిణీ చేశారు. రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన మహానేత వైఎస్సార్ అని పలువురు నేతలు కొనియాడారు. ఆయన వేసిన బాటలో తనయుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు.

- పాలనాదక్షుడికి మనసారా ప్రణామం
- దక్షిణలో మహానేత, మాజీ సీఎం రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు
- పేదలకు చీరలు, పండ్ల పంపిణీ


జగదాంబ జంక్షన్‌లో మహానేత విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాసుపల్లి, జాన్‌వెస్లీ


పేదలకు చీరలు అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు

దాబాగార్డెన్స్: మహానేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సోమవారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో నిర్వహించారు. మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేదలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ బీచ్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మహానేత విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి 29, 31 మండల అధ్యక్షులు పీతల వాసు, దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకుడు బొల్లవరపు జాన్‌వెస్లీతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పేదలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సుపరిపాలన అందించి వారి గుండె చప్పుడుగా నిలిచిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, బిపిన్‌కుమార్‌జైన్, నియోజకవర్గ నాయకులు మహ్మద్ షరీఫ్, మాసిపోగు రాజు, ప్రసాద్, ముత్తాబత్తుల రమేష్, సనపల రవీంద్ర భరత్, తాడి రవితేజ, ఆనంద్, దిలీప్, దశమంతుల చిన్ని, వేణు, రాము, మహేష్, సాగర్, బొడ్డేటి ప్రసాద్, ముజీబ్‌ఖాన్, గనగల్ల రామరాజు పాల్గొన్నారు.

39వ వార్డులో..
వార్డు పరిధి లక్ష్మీటాకీస్ బస్టాప్ వద్ద నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో మహానేతకు నివాళులు అర్పించారు. తిత్తి కృష్ణ, వెంకటి, కమల్, ఆది, రాజేష్, పాలరాజు, 36వ వార్డు నాయకుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో..
కువైట్‌లో ఉపాధి పొందుతున్న నగరానికి చెందిన వేగి రామకృష్ణ పాతపోస్టాఫీస్ సమీపాన గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా వృద్ధులకు అన్న సమారాధన జరిపి, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఫోన్‌లో మాట్లాడుతూ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..
మహానేత వర్ధంతి కార్యక్రమం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగింది. పార్టీ నాయకులు గుత్తుల శ్రీనివాస్, సోడదాసి సుధాకర్, కస్తూరి వెంకట్రావు పాల్గొన్నారు.

34వ వార్డులో..
అల్లిపురం: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో వాడవాడలా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ చైర్మన్ లండా రమణ, వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

33వ వార్డులో..
వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు నాయకులు కొడమంచిలి శ్రీను, సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరపల్లి రాము ఆధ్వర్యంలో..
వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరపల్లి రాము ఆధ్వర్యంలో కుమ్మరవీధిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. అనంతరం పేద మహిళలకు 5 కేజీలు చొప్పున బియ్యం అందజేశారు. పీవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

35 వార్డులో..
జగదాంబ: జీవీఎంసీ 35 వార్డులో వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో మహానేత రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. వార్డులోని గాజులవీధిలో గల వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు, వార్డు నాయకులు ఆదివిష్ణురెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం, పోలవరపు రమణమ్మ, శ్రీనివాస రెడ్డి, సంతోష్‌రెడ్డి, నగేష్, వినోద్, రాంబాబు, చిన్నారి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేమన మందిరంలో..
సీతమ్మధార: ఆశీలమెట్ట వద్ద గల వేమన సంక్షేమ సంఘంలో జరిగిన దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం వల్లే లక్షలాది మంది నిరుపేదలు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందుతున్నారన్నారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, సంఘం గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి రామకృష్ణారెడ్డి, కోశాధికారి ఎస్.బాలిరెడ్డి, సత్తి సుబ్బిరెడ్డి, బోర కుమార్‌రెడ్డి, శ్యామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దొండపర్తిలో..
జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి జాన్‌వెస్లీ నివాళులర్పించారు. జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ షరీఫ్, మధురెడ్డి, అజయ్‌రెడ్డి, శివశంకర్, పెద్దాడ రమణ, దాసరి విజయ భాస్కరరెడ్డి, ఎ.కుమారి, మల్లేశ్వరి, రమణమ్మ, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.


వేమన మందిరంలో వైఎస్‌ఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు


మహానేత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముజీబ్‌ఖాన్ తదితరులు


33వ వార్డులో వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు


33వ వార్డులో పేద మహిళలకు బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరపల్లి రాము



మహానేత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్


వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్జిపర్తి తదితరులు

జీవీఎంసీలో కారుణ్య నియామకాలు జరపాలి

సీతమ్మధార: జీవీఎంసీలో కారుణ్య నియామకాల కేటగిరీలో తక్షణమే భర్తీలు చేయాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న 62కి పైగా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. అనారోగ్యంతో పని చేయలేని 400 మంది కార్మికుల స్థానంలో వారి వారసులకు పోస్టులివ్వాలని కోరారు. కార్మికులకు జీవో 12 ప్రకారం రూ.వెయ్యి బోనస్ వెంటనే చెల్లించాలని, యూజీడీ కార్మికులకు జీవో 36 ప్రకారం బకాయిలతో కలిపి రూ.24,500 వేతనం చెల్లించాలని, నీటి సరఫరా విభాగం కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజు, జోన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎస్.రమణ, గణేష్, నాగరాజు, అప్పారావు, ఈశ్వరరావు, ఆర్.శ్రీను, కార్మికులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.

వరద బాధితులకు ఆహారం ప్యాకెట్ల పంపిణీ


వరద బాధితుల కోసం తరలిస్తున్న ఆహారం ప్యాకెట్లు

మహారాణిపేట: విజయవాడ వరద బాధితుల కోసం ఉదయం అల్పాహారం ప్యాకెట్లు 50 వేలు, మధ్యాహ్న భోజనం 50 వేలు, రాత్రి భోజనం 50 వేల ప్యాకెట్లు తయారు చేసి పంపుతున్నట్టు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. మూడు రైళ్లలో వీటిని తరలించారు.

ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

దాబాగార్డెన్స్: పారిశ్రామిక ప్రమాదాలు అరికట్టాలని, ఇటీవల జరిగిన ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు జరిపి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో అచ్యుతాపురం, పరవాడ సెజ్‌ల్లో ప్రమాదాలు జరిగాయన్నారు. ఎసెన్షియల్, సినర్జిస్ ఫార్మా ప్రమాదాల్లో 22 మంది మృత్యువాత పడ్డారని, అనేక మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారన్నారు. 2012 మే 7న ఎల్జీ పాలిమర్స్‌లో జరిగిన ఘోరప్రమాదంలో దాదాపు 15 మంది కార్మికులు చనిపోయినా ప్రమాదాలు అరికట్టే చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల ప్రాణాలు తీస్తున్న యాజమాన్యాలను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కార్పొరేట్ల పక్షాన ఉన్నట్టు మరోసారి రుజువైందన్నారు.

29వ వార్డులో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డులో వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ జంక్షన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ముందుగా కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం డొక్కా సీతమ్మ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం జరిపారు. వార్డు పరిధి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గిరిబాబు, శ్రీనివాసరావు, సురేష్, అప్పలరాజు, శ్రీనివాస్, ప్రవీణ్, మాణిక్యం, గురునాథరావు, రాజు, రామకృష్ణ, రాము, అశోక్, చిన్ని, శివ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పునరుద్ధరణ


వెలంపేట వద్ద పైపులైన్ పునరుద్ధరణ పనులు చేస్తున్న తాగునీటి విభాగం సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద పాతనగరానికి సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ శిథిలమై తాగునీరు వృథాగా పోతుండడంతో 'సాక్షి'లో కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన అధికారులు పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. అయితే పైప్‌లైన్ పురాతన కాలం నాటిది కావడంతో అది మరింత శిథిలం అయింది. అంతే కాకుండా తవ్విన గొయ్యి పైన ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో మరోసారి 'సాక్షి'లో 'తవ్వి వదిలేశారు' పేరిట మరో కథనం వెలువడింది. దీంతో స్పందించిన తాగునీటి విభాగం అధికారులు కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం పైపులైన్ ఉండే ప్రాంతంలో పూర్తిగా తవ్వి కొత్తలైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీఎంహెచ్‌వో యూపీహెచ్‌సీ సందర్శన


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం రామ్‌నగర్‌లోని భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అమలుపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులను సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

అల్లిపురం: ఆగస్టు 29వ తేదీన అల్లిపురం, కొబ్బరితోటకు చెందిన మైలపల్లి ప్రకాష్ తన పల్సర్ వాహనాన్ని రాత్రి ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు చూడగా బండి కనపడలేదు. దీనిపై టూటౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్.ఐ. సునీల్, క్రైం డీసీపీ వెంకటరత్నం ఆదేశాల మేరకు ఈస్ట్ క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు, ఇన్‌స్పెక్టర్ ఆదాముల పర్యవేక్షణలో నిందితులు విజయవాడకు చెందిన ఇల్లా సత్య ఆంజనేయులు, తాటి నాని, కోయన విజయకృష్ణగా గుర్తించారు. వారిని విజయవాడలో గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమ వారం రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో..: అల్లిపురం మెయిన్‌రోడ్డుకు చెందిన డెక్కాటి రవిరాజ్ గురునాథ్‌రెడ్డి ఆగస్టు 5వ తేదీ రాత్రి 11 గంటలకు తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు లేచి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో టూటౌన్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన క్రైం ఎస్.ఐ. ఎన్.సునీల్, నగర క్రైం డీసీపీ వెంకటరత్నం సూచనల మేరకు ఈస్ట్ ఏసీపీ ఎ.వెంకటరత్నం, ఈస్ట్ క్రైం సీఐ ఆదాము పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టి నిందితులు అనకాపల్లి జిల్లా కేడీపేటకు చెందిన మైనర్లుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను ప్రభుత్వ బాలల గృహానికి తరలించారు.